
ప్రకృతి ఒడిలో మైమరిపించే అందాల పాపికొండల యాత్రకు తెర తొలగింది. గోదావరి సోయగాలను తిలకిస్తూ పులకించిపోయే పర్యాటక పర్వం మొదలయ్యే సందర్భం రానేవచ్చింది. వరదల సీజన్ ముగియడంతో పర్యాటక సీజన్‌కు పచ్చజెండా ఊపారు ఏపీలోని కాకికాడ పోర్టు అధికారులు. దీంతో గత రెండు రోజులుగా ఏపీలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వరరామచంద్రాపురం మండలం పోచవరం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. తెలంగాణ వైపు నుంచి పాపికొండల పర్యాటకానికి వెళ్లాలంటే హైదరాబాద్ నుంచి ఖమ్మం మీదుగా భద్రాచలం రావాల్సి ఉంటుంది. ఇక్కడ నుంచి నెల్లిపాక, కూనవరం మీదుగా వరరామచంద్రాపురం మండలం పోచవరానికి 80 కి.మీ. వాహనాల్లో ప్రయాణించి గోదావరి ఒడ్డున సిద్ధంగా ఉంచిన లాంచీల్లో ప్రయాణించి విహారయాత్ర ముగిసిన అనంతరం మళ్లీ భద్రాచలం చేరుకోవాల్సి ఉంటుంది.

-ఆంధ్రజ్యోతి, భద్రాచలం

పాపికొండలు పిలుస్తున్నాయి...



- ఆరు నెలలపాటు సాగనున్న విహార యాత్ర
- పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750
- రక్షణ చర్యలపై అధికారుల ప్రత్యేక దృష్టి

మెయిన్ 14లో

ఫటాఫట్

'ఆరోగ్యశ్రీ'లో అవినీతి జరగనివ్వం

డాక్టర్ వి.సుబ్బారావు, డీఎంహెచ్‌వో, ఖమ్మం



ప్రశ్న: ఖమ్మం జిల్లాలో డెంగ్యూ కేసులు అధికంగా నమోదవుతున్నాయి కదా.. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. అన్ని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల పరిధిలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం.

ప్ర: వైద్య, ఆరోగ్యశాఖలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది కదా..?

జ: ఇప్పటికే ఖాళీలను గుర్తించాం. జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీపంలో ఉన్న మెడికల్ ఆఫీసర్లకు విధులు కేటాయించాం. వైద్యుల, సిబ్బంది పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేస్తున్నాం.

ప్ర: రక్తహీనతతో మాతృమరణాలు సంభవిస్తున్నాయి.. నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు..?

జ: ఎనిమియా ముక్త్ కార్యక్రమాన్ని అమలుచేస్తున్నాం. రక్తహీనత ఉన్న మహిళలు గల గ్రామాలను గుర్తించి మందులు అందించడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: ఆరోగ్యశ్రీ అమలులో అవినీతి సంగతేమిటి..?

జ: ఇప్పటి వరకు కొన్ని ఆస్పత్రుల్లో జరిగినట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఇక నుంచి అన్ని ఆస్పత్రుల్లో ఆరోగ్య మిత్రలను నియమించి ఇలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం కలెక్టరేట్



దొంగ.. దొంగ..

ఆంధ్రజ్యోతి పరిశీలన

ప్రజలను వణికిస్తున్న వరుస దొంగతనాలు

- తాళం వేస్తే తలుపులు పగిలినట్టే
- యేటికేడు పెరుగుతున్న చోరీ ఘటనలు
- సగానికి కూడా మించని రికవరీలు
- పనిచేయని సీసీ కెమెరాలు
- గస్తీకి సుస్తీ చేయడం వల్లే రెచ్చిపోతున్న దొంగలు
- మళ్లీ పెరుగుతున్న చైన్ స్నాచింగ్‌లు

ఖమ్మం క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం, చుట్టాలిల్లు, శుభకార్యం ఇలా.. కార్యక్రమం ఏదైనా అవ్వని వ్వండి.. నిత్యం వాహనాలు తిరిగే ప్రదేశం, రద్దీగా ఉండే ప్రాంతం ఏదైనా కానివ్వండి.. రెండురోజులపాటు బయట ప్రాంతాల్లో గడిపితే చాలు గుట్టుగా సర్దేస్తున్నారు. తాళం వేసి ఉంటే చాలు తలుపులు పగలగొట్టి మరీ తులాల కొద్దీ సొత్తు దోచుకెళ్లిపోతున్నారు. ఇక వాహనాలైతే గంటల వ్యవధిలోనే ఎత్తుకెళ్లిపోతున్నారు. ప్రధాన సెంటర్లనీ, ప్రజలు తిరిగే ప్రదేశమన్న తేడా లేకుండా లోపలకెళ్లి బయ టకొచ్చే లోపు మాయం చేసేస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో నమోదవుతున్న కేసుల తీరు ఇది. జిల్లాలో యేటికేడు చోరీల సంఖ్య ఎక్కువవుతోండగా.. ఇటీవల కాలంలో ఆ సంఖ్య పెరిగిపోతున్నట్టుగా తెలుస్తోంది. కాగా ఆయా చోరీలకు సంబంధించి రిక వరీ మాత్రం సగానికి కూడా మించని పరిస్థితి నెలకొంది.

తాళం వేస్తే తలుపులు పగిలినట్టే:

వరుసగా రెండు రోజులపాటు ఎక్కడికైనా వెళ్లాలంటే చాలు భయాందోళనలో ప్రజలు బతకా ల్సిన పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడిచిన కొంత కాలంగా తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోం డగా.. అవి పట్టణ, నగరాల్లోనే అత్యధికంగా ఉన్నట్టుగా స్పష్టమవుతోంది. అయితే ముందుగానే దొంగలు తాళం వేసి ఉన్న ఇండ్లపై కన్నేసి.. వాటిపై రెక్కీ నిర్వహించి మరీ చోరీలకు పాల్పడుతున్నట్టుగా తెలుస్తోంది. అందులో భాగగానే తాళం వేసి ఉన్న ఇళ్లల్లో తలుపులు పగలగొట్టి మరీ తులాల కొద్దీ సొత్తు చోరీ చేసుకెళ్లిపోతు న్నారు. ఫలితంగానే రాత్రి వేళల్లో చోరీ కేసుల సంఖ్య అధికమవుతున్నట్టుగా స్పష్టమ వుతోంది. ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లలో వందల కేసులు నమోదు కావడమే అందుకు నిదర్శనం.

కాగా జిల్లాలో జరుగుతున్న చోరీల కేసులు పోలీసులకు సవాల్‌గా మారుతోం డగా.. నమోదైన కేసుల్లో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో చోరీలు జరగడం కొసమె రుపు. అంతేకాదు చైన్ స్నాచింగ్ కేసులు సైతం పెరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ఇళ్ల ముందు ముగ్గులు వేస్తున్న సమయాల్లో, రోడ్లపై ఒంటరిగా వెళ్తున్న వారిని పరిశీ లించి మరీ పక్కాగా మెడలో బంగారు గొలుసులు లాక్కెళ్లిపోతున్నారు. జిల్లాలో నమోదయ్యే చోరీ కేసుల్లో సింహభాగం ద్విచక్రవాహనాలదనే చెప్పాలి. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, సర్దార్ పటేల్ స్టేడియం, వైరా రోడ్డు వంటి రద్దీ ప్రదేశాల నుంచి మొదలుకుని ఇంటి ముందు నిలిపి ఉంచిన వాహనాలు సైతం తస్కరణకు గురవు తున్నాయి. అదీ కూడా గంటల వ్యవధిలోనే మాయమవడం గమనార్హం.

పనిచేయని సీసీ.. గస్తీకి సుస్తీ

యేటికేడు చోరీ కేసుల సంఖ్య పెరుగుతోండగా.. వాటికి అడ్డుకట్ట వేయకపోవడా నికి రెండు రకాల కారణాలు కనిపిస్తున్నట్టుగా తెలుస్తోంది. చోరీ జరగడానికి ముందుగా అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు (మిగతా 6వ పేజీలో)



సిటీ బస్టాండ్‌లో చైన్ స్నాచింగ్

ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని సిటీ బస్టాండ్‌లో సోమవారం నేలకొండపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలి మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును గుర్తు తెలి యని వ్యక్తి లాక్కెళ్లాడు. వెంటనే ఆ వృద్ధురాలు బస్టాండ్‌లోని పోలీసులకు, ఆర్టీసీ సిబ్బందికి ఫిర్యాదు చేసి సీసీ కెమెరాలో చూడాలని కోరారు. కాగా సీసీ కెమెరాలో దొంగ తనం రికార్డు కాలేదని తెలిసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాపు అక్కడ.. ఊపు ఇక్కడ!

- ఏపీ మద్యం దుకాణాల్లో ఉమ్మడి జిల్లా వ్యాపారుల లక్కు
- సరిహద్దు జిల్లాల్లో 40 శాతం దుకాణాలు కైవసం
- ఎన్టీఆర్, పశ్చిమ, తూర్పు గోదావరి మద్యం వ్యాపారంలో ఖమ్మం వాసులు
- వారం రోజులుగా సరిహద్దు జిల్లాలోనే మకాం

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మద్యం టెండర్లు జరిగితే సరిహద్దు జిల్లాలోని మద్యం వ్యాపారులు పాల్గొంటారు. గతేడాది తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మద్యం టెండరు ప్రక్రి యలో ఏపీకి చెందిన మద్యం వ్యాపారులు జోరుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా లోని మద్యం టెండర్లలో పాల్గొన్నారు. ఆదే స్థాయిలో మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. అయితే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాలకు టెండరు ప్రక్రియ జరిగింది. ఏపీలో కూడా ప్రభుత్వం మారింది. పారదర్శ కంగా మద్యం వ్యాపారం జరుగుతుందని ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మద్యం వ్యాపారులు ఏపీలో మకాం వేశారు. ఇప్పటికే ఉమ్మడి భాగ స్వామ్యంతో తెలుగు రాష్ట్రాల మద్యం వ్యాపారులు ఇరు రాష్ట్రాల్లో మద్యం వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి ఏపీలో మద్యం టెండర్లు వేసేందుకు వెళ్లిన వ్యాపారులకు అక్కడి వ్యాపారులు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నారు.

సరిహద్దు జిల్లాలో 40శాతం దుకాణాలు కైవసం..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఎన్టీఆర్, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలు ఉన్నాయి. వీటిలో ఎన్టీఆర్ జిల్లా ఖమ్మం జిల్లా సరి హద్దుతో, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దులో ఉన్నాయి. సోమవారంతో ఏపీలో మద్యం టెండర్ల ప్రక్రియ ముగిసింది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 113 మద్యం దుకాణాలుండగా వాటిలో 40దుకాణాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా మద్యం వ్యాపారులు దక్కించుకున్నారు. ఇక పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలోని మద్యం దుకాణాల్లో 40శాతం దుకాణాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా మద్యం వ్యాపారులు దక్కించుకున్నారు.

పోడు రైతులకు ప్రభుత్వం అండ

- ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాల అభివృద్ధి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఉపాధిహామీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

6





చదువు చెల్లింపులకు బ్రేక్...

- ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల కోసం ఎదురుచూపులు
- నిరవధిక బంద్‌కు పిలువునిచ్చిన యాజమాన్యాలు

7

భళా.. సత్యబాబు

- ఆన్‌లైన్ శిక్షణతో బాక్సింగ్‌లో తనదైన ముద్ర
- కొబ్బరిబొండాల వ్యాపారంతోనే జీవనం

6



నేడు కొత్త టీచర్లకు పోస్టింగ్‌లు

ఖమ్మం ఖానాపురం హవేలి/కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): డీఎస్సీ ద్వారా టీచర్లుగా ఎంపికైన వారికి మంగళవారం నగరంలోని డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు ఖమ్మం డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 520మందికి ఒక్క రోజులోనే కౌన్సిలింగ్ నిర్వ హించి సాయంత్రం ఖాళీలను బట్టి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను వెంట తెచ్చుకోవాలని డీఈవో తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో టీచర్లుగా ఎంపికైన వారు పాత కొత్త గూడెం మార్వాడీ క్యాంప్‌లోని కొత్తగూడెం ఇంగ్లీష్ మీడియం స్కూల్(జిల్లా పరిషత్ పాఠశాల, ఆనందఖని)లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని డీఈవో వెంకటేశ్వరాచారి కోరారు. ర్యాంకుల మెరిట్ ప్రకారం పోస్టింగ్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఖాళీల వివరాలు నోటీస్ బోర్డులో ఉంచామని తెలిపారు.

27న రొట్టమాకురేవు పురస్కారాలు

ఖమ్మంసాంస్కృతికం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన సాహిత్య ప్రముఖుడు యాకూబ్ నిర్వహించే రొట్టమాకురేవు పురస్కా రాల ప్రదానోత్సవ సభ ఈనెల 27న హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో సాయంత్రం 6గంటలకు జరగనుంది.. కవిత్వంలో ప్రతిభ కనబరిచిన కవుల సంపుటాలకు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే కేవీఎల్ నరసింహారావు, తదితర ప్రముఖుల పేర్లతో ఈ అవా ర్డులను ప్రతి ఏటా అందజేస్తున్నారు. ఈ ఏడాది షేక్ మహ్మద్ మియా స్మారక అవార్డును ఏనుగు నరసింహారెడ్డికి, పురిపాటి రామి రెడ్డి స్మారక అవార్డును అరుణ నారదభట్లకు, కేవీఎల్ నరసింహారావు స్మారక అవార్డును తండా హరీష్ గౌడ్‌కు, సాంబమూర్తి లండాకు అందజేయనున్నారు.

ఎడమకాల్వ కట్ట మరింత పటిష్ఠం

పాలేరు జలవిద్యుత్ కేంద్రం వద్ద ఎత్తు, వెడల్పు పెంపు 6



పాలేరు జలవిద్యుత్‌కేంద్రం వద్ద జరుగుతున్న కట్ట ఎత్తు పనులు

అతడొక ఆన్‌లైన్ బాక్సింగ్ కోచ్

- బాక్సింగ్ క్రీడాకారుడిగా పలు బహుమతులు
- ఉన్నత విద్యనభ్యసించినా దక్కని ఉద్యోగం
- కొబ్బరిబొండాల వ్యాపారం తోనే జీవనం
- ప్రస్తుతం సోషల్‌మీడియా వేదికగా బాక్సింగ్‌లో శిక్షణ
- నైపుణ్యం ఉన్నా ప్రోత్సాహం లేదంటున్న ఔత్సాహిక శిక్షకుడు



చుంచుపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సంకల్పం ఉంటే సముద్రాన్నైనా ఈదవచ్చంటారు. అలాగే పట్టుదల ఉంటే ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనైనా ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయవచ్చని నిరూపిస్తున్నాడు కొత్తగూడేనికి చెందిన గుత్తుల సత్యబాబు. కుటుంబ పోషణకోసం కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తున్నా అతడిలో దాగిఉన్న బాక్సింగ్ కళను పదిమందికి పంచు తూ ఆ క్రీడకు ప్రాణం పోస్తున్నాడు. సత్యబాబు తల్లిదండ్రులైన గుత్తుల త్రిమూర్తులు, లక్ష్మి దంపతులు ఏపీలోని రాజోలు నుంచి 1980లో కొత్తగూడేనికి వచ్చి చిన్న వ్యాపారం చేసుకుంటూ ఇక్కడే స్థిరపడ్డారు. సత్యబాబు 1వ తరగతి నుంచి పీజీ వరకు కొత్తగూడెంలోనే చదివిని సత్యబాబు, ఖమ్మంలో ఎంబీఏ పూర్తి చేశాడు. బాక్సింగ్ క్రీడ సహాయంతో ఆర్మీలో ఉద్యోగం సంపాదించిన తన బాను ఆద ర్శంగా తీసుకొని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో శిక్షకుడు బండారి ఎల్లయ్య వద్ద బాక్సింగ్ ఓనామాలు దిద్ది బాక్సింగ్ నేర్చుకున్నాడు. కానీ అతడి చదువు, బాక్సింగ్ క్రీడ అతడికి ఉద్యోగ పరంగా ఉపయోగపడకపోయినా తనలోని బాక్సింగ్ నైపుణ్యాలను పదిమందికి పంచాలని సంకల్పించాడు. ఆ సంకల్పం తోనే ఎవ్వరూ సహకరించపోయినా కుటుంబ పోష ణకు కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తూనే బాక్సింగ్ కోచ్‌గా అవతారమెత్తాడు. సోషల్ మీడియా వేది కగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిసున్నాడు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలపై బాక్సింగ్ క్లాసులను అందిస్తూ ఓత్సాహికులు బాక్సింగ్ నేర్చుకునేందుకు సహకరిస్తున్నాడు.



చిరు వ్యాపారం చేస్తూనే.. శిక్షకుడిగా రాణిస్తూ..

కొత్తగూడెం పట్టణంలో కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తూనే సత్యబాబు ప్రతిరోజు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు ప్రకాశం మైదానంలో ఓత్సాహిక క్రీడాకారులకు ఉచితంగా బాక్సింగ్‌లో శిక్షణ అందిస్తున్నాడు. సరైన సదుపాయాలు, బాక్సింగ్ రింగ్ వంటివి అందుబాటులో లేకపోయినా తనకు తోచిన విధంగా శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తనకు బాక్సింగ్ రింగ్ వంటి సదుపాయాలు కల్పించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపో వడంతో చేసేదేమీ లేక సోషల్ మీడియాను ఎంచుకొని యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లే వేదికగా తనలోని బాక్సింగ్ నైపుణ్యాన్ని పదిమందికి పంచుతూ ఔరా అనిపిస్తున్నాడు. ప్రస్తుతం అతడి యూట్యూబ్ ఛానల్‌లో 2,216 మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

నైపుణ్యం ఉన్నా ప్రోత్సాహం కరువు

బాక్సింగ్ క్రీడాకారుడుగా 2002 ఉమ్మడి రాష్ట్రంలో సబ్ జూనియర్ విభాగంలో వెండి పతకం సాధించడంతో సత్యబాబు వెలుగులోకి వచ్చాడు. 2008 వరకు బాక్సింగ్‌లో శిక్షణ తీసుకు న్నాడు. 2004, 2005 సీనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో కాస్యం పతకం సాధించాడు. 2006, 2007, 2008 సంవత్సరాల్లో మూడుసార్లు కాకతీయ యూనివ ర్సిటీ క్రీడల్లో వెండి పతకాలు సాధించాడు. 2012, 2013లో వైజాక్ జరిగిన జాతీయ ఓపెన్ టోర్నమెంట్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్నాడు. 2013నుంచి సత్యబాబు శిక్షకుడిగా మారి వెయ్యి మందికి పైగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చాడు. అతడి వద్ద శిక్షణ పొందిన అనేకమంది పలుపోటీల్లో పతకాలు సాధిం చారు. తెలంగాణ మొదటి ఏకలవ్య మోడల్ స్కూల్‌కు బాక్సింగ్ క్రీడా తరుపున రాష్ట్ర కోచ్‌గా వ్యవహరించగా ఆయన శిక్షణలో క్రీడాకారులు 18పతకాలు సాధించారు. ఇన్ని సాధించినా అతడికి ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సా హం లేకపోవడంతో సోషల్‌మీడియా వేదికగా తను శిక్షణ అందిస్తూ పలువురికి సాయపడుతున్నాడు. ప్రభుత్వం సహకరిస్తే మరింత మంది క్రీడాకారులకు శిక్షణ ఇస్తానని సత్యబాబు చెబుతున్నాడు.



కేక్ కట్ చేస్తున్న బ్రాంచి మేనేజర్ పుల్లారావు

ఘనంగా 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షిక వేడుకలు

ఖమ్మం టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక 22 వసంతాలు పూర్తిచేసుకుని 23వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా సోమవారం రాత్రి ఖమ్మం యూనిట్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు కేక్ కట్ చేశారు. ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్న 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక మొక్కవోని ధైర్యంతో వార్తలు ప్రచురిస్తూ పాఠకుల హృదయాల్లో చిరస్థాయిలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి శంకర్‌రావు శెంకేసి, బ్యూరో ఇన్‌చార్జి నలజాల వెంకటరావు, స్టాఫ్ రిపోర్టర్ తాళ్లూరి రమేష్, సర్క్యులేషన్ మేనేజర్ మొగలపు వెంకట సూర్యనారాయణ, యాడ్స్ మేనేజర్ మానప్రగడ రమేష్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి కె.సురేష్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు

ఉమ్మడి జిల్లా క్రీడాకారిణులు

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 25వరకు పశ్చిమబంగాల్ రాష్ట్రం లోని సిల్లిగురిలో జరగనున్న జాతీయస్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి నలుగురు క్రీడాకారిణిలు ఎంపికయ్యారు. ఖమ్మం నగరానికి చెందిన కావ్యతోపాటు వీవీపాలెం గ్రామానికి చెందిన అఖిల, శ్రీలక్ష్మి, పాల్వంచకు చెందిన అలేఖ్యలు తెలంగాణ జట్టుకు ఎంపికైనట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆదర్శ్‌కుమార్ తెలిపారు. వారు ఇటీవల రాష్ట్రస్థాయి పోటీ లలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు అభినందిం చారు. జాతీయ పోటీల్లో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

నేడు క్రీడాజ్యోతి ర్యాలీ

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కప్ క్రీడా పోటీల్లో భాగంగా రాష్ట్ర క్రీడల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో క్రీడాజ్యోతి ర్యాలీని నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాజ్యోతి మంగళవారం ఉదయం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియం నుంచి ప్రారంభమైన క్రీడా జ్యోతి ర్యాలీ ఉదయం 10 గంటల కల్లా జిల్లాలోని ఏన్కూరు మండలం హిమాంనగర్‌కు చేరుతుందని, ఆ తరువాత సాయంత్రం నగరానికి చేరుకుంటుందని అనంతరం సాయంత్రం 4గంటలకు స్థానిక సర్థార్ పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్‌బండ్ వరకు క్రీడా జ్యోతి రన్ ర్యాలీ కొనసాగుతుందని ఆయన తెలిపారు. ర్యాలీకి జిల్లాలోని క్రీడా సంఘాల బాధ్యులు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.



సండ్ర కొడుకు పెళ్లికి హాజరైన సీఎం

సత్తుపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య-మహాలక్ష్మి దంపతుల కుమారుడు భార్గవ్ వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రము ఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వివాహం హైదరాబాద్‌లోని శ్రీనగర్‌కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై నూతన దంపతులు సండ్ర భార్గవ్-చిద్విత‌సాయిలను ఆశీర్వదించారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీఎస్ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు, రాజ్యసభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి ఇతర ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన

53మంది డీఎస్సీకి ఎంపిక

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగాలకు బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ పొందిన వారిలో 53మంది ఎంపికై ఉపా ధ్యాయ పోస్టులు పొందారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ జీ శ్రీలత తెలిపారు. 33మంది ఎస్జీటీ, 20మంది స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభి నందించారు.

రేపటి నుంచి బెల్గావి ఎక్స్‌ప్రెస్ రైలు పునరుద్ధరణ

కారేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీపురం రైల్వేస్టేషన్ ద్వారా ప్రయా ణించే బెల్గావి ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వే అధికారులు రేపు బుధవారం నుంచి పునః ప్రారంభించను న్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. మండల పరిధిలోని గాదెపాడు గ్రామానికి చెందిన ఈ ప్రాంత సామాజిక కార్యకర్త మేముల రామ్మూర్తి రెండురోజుల క్రితం సంబంధిత రైల్వేఅధికారు లను కలిసి బెల్గావి ఎక్స్‌ప్రెస్ రైలు గురించి అధికారులను అడిగారు. దీంతో స్పందించిన అధికారులు ఈనెల 16 నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు రామ్మూర్తికి లెటర్ ద్వారా సమాచారం అందించారు. 5 నె లల క్రితం మణుగూరు రైల్వేస్టేషన్ నుంచి బెల్గావి రైలు కొత్తగూడెం నుంచి కారేపల్లి మండలంలోని గాంధీపురం ద్వారా వెళ్లే బెల్గావి రైలు ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ రైలును పునః ప్రారంభిస్తుండడం పట్ల ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోడు రైతులకు ప్రభుత్వం అండ

- ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాల అభివృద్ధి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఉపాధిహామీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రఘునాథపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోడు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, పోడు పట్టాల నుంచి పోడు సాగు కోసం డ్రిప్ పథకాలు, ఉచితంగా బోర్లు, విద్యుత్ సౌక ర్యాలను కల్పించి ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా రఘునాథ పాలెం మండలంలోని మారుమూల గ్రామాలైనా రజబ్‌అలీనగర్, పంగిడి, ఎన్వీ బంజర పంచాయతీల్లో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులకు సోమవారం మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వ హయాంలో యూపీఏ చైర్‌పర్సన్‌గా ఉన సోనియాగాంధీ ప్రత్యేక చొరవతో అటవీహక్కుల చట్టాన్ని రూపొందించి పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు ఉచితంగా హక్కు పత్రాలను పంపిణీ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలో ఉన్నా రైతులు, ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో పోడు సాగు చేస్తున్న రైతులకు అటవీశాఖ నుంచి సాంకేతిక ఇబ్బం దులు తలెత్తడంతో వ్యవసాయ బోర్లు, విద్యుత్ కనెక్షన్ల మంజూరు ఇబ్బందిగా ఉందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని వాటిని పరిష్క రిస్తుందని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోనే తమ ప్రభుత్వం రూ.2లక్షలకు పైగా వ్యవసాయ రుణాల మాఫీ చేస్తోందన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలలు, వైద్యకేంద్రాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామ న్నారు. రఘునాథపాలెం మండలం గతంలో ఖమ్మంఅర్బన్ ప్రాంతంలో కలిసి ఉండేదని, అభివృద్ధి పథకాల మంజూరులో ఇబ్బందులు తలెత్తడంతో గతంలో తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రఘునాథపాలెం మండలాన్ని ఏర్పాటు చేశానని, ఇప్పుడు అదే మండలాన్ని రాష్ట్రం లోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని మంత్రి పేర్కొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

గుడిసెలు, రేకుల ఇళ్లులేని మండలంగా రూపొందిస్తామన్నారు. ప్రతి గ్రామంలో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం చేయిస్తామని, నాగార్జున సాగర్ జలాలతో మండలంలో సాగు నీటి కొరత తీరుస్తా మన్నారు. జింకలతండా రహదారిని నాలుగు వరసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని మంత్రి తుమ్మల సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డం గుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కార్పొరేటర్ మలీదు జగన్, నాయ కులు సాధు రమేశ్‌రెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తరామదాసు మరమ్మతులు పూర్తి

ట్రయల్‌రన్ విజయవంతం



కాల్వలోకి పారుతున్న సాగర్ జలాలు

కూసుమంచి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):భక్తరామదాసు ప్రాజెక్టు మరమ్మ తుల పనులు పూర్తయ్యాయి. ఈమేరకు సోమవారం ట్రయల్‌రన్ విజయవంత మైంది. సెప్టెంబరు 1న వచ్చిన వరదల కారణంగా పాలేరు జలాశయం బ్యాక్ వాటర్ పెరగడంతో భక్తరామదాసు ప్రాజెక్టు వరదనీటితో పూర్తిగా నిండిపో యింది. ఒండు చేరడంతో పాటు, అన్ని పరికరాలు కాలిపోయాయి. దీంతో ఇరిగే షన్ ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తరామదాసు ప్రాజెక్టు మరమ్మతుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నెలరోజుల అనంతరం రెండు యూనిట్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తిచేశారు. ఈమేరకు సోమవారం ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు, డీఈ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రయల్‌రన్ వేయగా విజయ వంతమైంది. కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో పంటలసాగుకు అవసరమైనప్పుడు నీటిని విడుదల చేసేందుకు భక్తరామదాసు ప్రాజెక్టును సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

దొంగ.. దొంగ..

(5వ పేజీ తరువాయి)

పాటించాల్సిన ప్రధాన అంశం నిత్యం గస్తీ నిర్వహించడం. అనుమానస్ప దంగా కనిపించిన వారిని విచారించి దొంగతనాలను నివారించడం ప్రధాన ధ్యేయం. కానీ గత కొద్ది నెలలుగా గస్తీకి సుస్తి చేసిందన్న విమర్శలు వెల్లువె త్తుతున్నాయి. గతంలో పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన ప్రాంతాల్లో అన్నీ ప్రదేశాలను పరిశీలిస్తూ గస్తీ నిర్వహించే వాహనాలు ప్రస్తుతం ఏదో ఒక ప్రాంతానికే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

ఒకటి రెండు గల్లీల్లో తిరిగి అంతటితో మమ అనిపిస్తున్నారన్న ఆరోప ణలు లేకపోలేదు. చోరీ జరగడాన్ని అడ్డుకోవడంతో విఫలమవుతున్న పోలీ సులు ఆ తర్వాత కేసుల చేధనలో ప్రధాన భాగంగా కనిపించే సీసీ కెమారా లను మరిచారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు ప్రధాన రహదా రుల్లో సైతం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయనప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని కేసులలో చోరి జరిగిన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికి అవి సరిగా కనపడక దొంగలను గుర్తించేందుకు వీలు లేకుండా పోతున్నట్లు తెలుస్తోంది. గతంలో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు పలు కాలనీల్లో, వీధుల్లో సమావే శాలు నిర్వహించి సీసీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించేవారు. కానీ ఇటీ వల కాలంలో అలాంటి సమావేశాలు కూడా ఎక్కడ కనపడని పరిస్థితి.

సగానికి మించని రికవరీలు

యేటికేడు వందలకొద్దీ చోరీ కేసులు నమోదవుతున్నా.. వాటిని సగం వరకు చేధిస్తోన్న పోలీసులు దానికి తగ్గట్టుగా రికవరీ చేయలేకపోతున్నా రన్న వాదన వినిపిస్తోంది. 2022లో 676 కేసులు నమోదవగా అందులో 338 కేసులను పోలీసులు చేధించారు. వాటిల్లో 198 ఇంటి దొంగతనాలు ఉండగా, మోటారు సైకిళ్లు, వైర్లు వంటి చోరీ కేసులు 356 ఉన్నాయి. అయా చోరీల్లో రూ. 4.96 కోట్లు నష్టం జరగ్గా.. రూ. 2.61 కోట్లు మాత్రమే రికవరీ చేశారు. 2023లో 460 కేసులు నమోదవగా అందులో 241 కేసులను చేధిం చారు. అందులో 150 ఇంటి దొంగతనాలు ఉండగా.. 278 ద్విచక్ర, వైర్లు చోరీ జరిగిన కేసులు ఉన్నాయి. వాటిల్లో రూ. 4.48కోట్లు నష్టం జరగ్గా.. రూ. 1.57కోట్లు మాత్రమే రికవరీ అయ్యాయి. ఇక ఈ యేడాది ప్రారంభం నుంచి ఆగస్టు నెలాఖరువరకు 405 కేసులు నమోదుకాగా.. వాటిలో 181 కేసులను పోలీసులు చేధించారు. సదరు కేసుల్లో రూ. 3.08 కోట్లు నష్టం జరగ్గా.. 1.12 కోట్లను రికవరీ చేశారు. కాగా దసరా సెలవులు సమీపిస్తోన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకెళ్లే క్రమంలో చోరీల భయం ఎక్కువ ఉన్న కార ణంగా గస్తీపై మరింత దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. దానితో పాటుగా చోరీలపై చొరవచూపి ముందు జరిగే దొంగతనాలకు చెక్ పెట్ట డంతోపాటు, జరిగిన దొంగతనాల్లో రికవరీ శాతం పెంచాలని ఆకాంక్షిస్తు న్నారు.

పదవుల పండుగ ఎప్పుడో ?

- నియామక పదవుల కోసం కాంగ్రెస్ కేడర్ ఎదురుచూపు
- అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా పూర్తిస్థాయిలో చేపట్టని నియామకాలు
- పండుగల వేళ పదవులొస్తాయని ఆశావహుల ఎదురుచూపు
- అధిష్ఠానంలో కనిపించని కదలిక

ఖమ్మం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయిల్లో ఆ పార్టీ నాయకులు నామినేటెడ్ పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ పార్టీ అధిష్ఠానం మాత్రం పూర్తిస్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీ చేయపట్టకపోవడంతో ఆశావహులు నిరాశకు లోనవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే లోక్‌సభ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో నామినేటెడ్ పదవుల నియామకానికి కొంత అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత జిల్లాలోని నేతలంతా పదవులపై ఆశలు పెట్టుకున్నారు. మొదటి విడత నియామకంలో జిల్లాలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయలనాగేశ్వరరావు, రాష్ట్ర చిన్ననీటిపారుదల సంస్థ చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు, వైరాకు చెందిన నాయుడుసత్యంకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు లభించాయి. భద్రాచలం నుంచి మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి లభించింది. కానీ ఉమ్మడిజిల్లాకు నాలుగు కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కినా ఇంకా ఆశావహుల జాబితా అధికంగానే ఉంది.

ఖమ్మం, కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, పాలేరు, మధిర, పినపాక నియోజకవర్గాల నుంచి ఇంకా కార్పొరేషన్ పదవులతో పాటు రాష్ట్రస్థాయి డైరెక్టర్లు, పలు దేవాలయాల కమిటీలు, మార్కెట్ కమిటీలు, ఇతర ప్రభుత్వ నియామక పదవులను ఆశిస్తున్నవారు ఎవరికి వారు పైరవీలు సాగిస్తున్నారు. ఏ పండుగ వచ్చినా ఆ పండుగకు నామినేటెడ్ నియామకాలు ఉంటాయన్న ప్రచారం జరగడం ఆ తరువాత ఆశావహులు నిరాశ చెందడం పరిపాటిగా మారింది. జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు కేంద్రమాజీమంత్రి రేణుకాచౌదరి వర్గీయులు ప్రతి నియోజకవర్గం నుంచి నియామక పదవులు ఆశిస్తున్నారు. ఇప్పటికే కొన్ని మార్కెట్ కమిటీచైర్మన్ పదవులు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులతో నియామకం చేశారు. మరికొన్ని పదవులకు రేపోమాపో అన్నట్టుగా కొన్ని పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే కీలకమైన భద్రాచలం వంటి దేవస్థానం చైర్మన్ పదవితో పాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు, ఖమ్మం సుడా వంటి పాలకవర్గం పదవులు ఇంకా నియమించాల్సి ఉంది. ఈ పదవుల కోసం ఆధిపత్య పోరు సాగుతోంది. ఎవరికివారు తమ నేతల సిఫార్సులతో పదవులు దక్కించుకునేందుకు పోటీపడుతున్నా అదిగో ఇదిగో అంటూ కాలయాపన సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కావస్తున్న నేపథ్యంలో పదవులు దక్కని నేతల్లో కొంత ఆవేదన కనిపిస్తోంది. ఒకటి రెండునెలల్లోనైనా పదవుల నియామకం జరిగితేనే ఫలితం ఉంటుందని, లేదంటే ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు, మండల, జిల్లాపరిషత్, ఆ తర్వాత సహకార ఎన్నకలంటూ మరో ఏడాది గడిచే అవకాశం ఉందని నాయకులు వాపోతున్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న ఏళ్లు పార్టీకోసం పనిచేసిన వారు ప్రస్తుతం నియామకం పదవులపైనే కొండంత ఆశతో ఉన్నారు. ఈ నేపథ్యంలో నియామక పదవుల విషయంలో పార్టీ రాష్ట్ర నాయకత్వంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని, రొటేషన్ పద్ధతిలో ఎక్కువ మందికి అవకాశాలు వచ్చేలా చూడాలని నాయకులు సూచిస్తున్నారు. దసరాకు నియామక పదవులుంటాయని కొండంత ఆశగా ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో ఇక దీపావళికైనా నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుందని నాయకులు ఎదురు చూస్తున్నారు.

కానిస్టేబుల్ సాగర్‌కు కన్నీటి వీడ్కోలు

ఆదుకుంటామన్న ఎమ్మెల్యే, ఎస్పీ



ఏన్కూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు పోలీసుస్టేషన్‌లో గంజాయి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ ఆత్మహత్యకు పాల్పడిన కానిస్టేబుల్ భూక్యా సాగర్ అంత్యక్రియలు సోమవారం స్వగ్రామం ఏన్కూరులో జరిగాయి. ఎమ్మెల్యే మాలోతు రాందా సనాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా వచ్చే అన్ని సదుపాయాలను కల్పి స్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి ఉద్యోగం కల్పించాలని జిల్లా ఎస్పీని కోరారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్వయంగా వచ్చి సాగర్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రభుత్వపరంగా వచ్చే సదుపాయాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కుటుంబానికి రూ.లక్షా 20వేల సహాయం అందించారు. నివాళులర్పించిన వారిలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రవిచంద్రచౌహాన్, భూక్యా వీరభద్రం, బానోతు బాలాజీ, ఖమ్మం ఏసీపీ నరేంద్రకుమార్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పోలీసు ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మంజిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జి.ఏసోబు పాల్గొన్నారు.

ఎడమకాలవ కట్ట మరింత పటిష్టం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూసుమంచి, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): పాలేరు జలవిద్యుత్ కేంద్రం వద్ద అధికారులు కాల్వ కట్ట ఎత్తు పెంచడంతోపాటు, వెడల్పు చేస్తున్నారు. పాలేరు జలాశయం 'ఎడమకాల్వకు పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో ఇరిగేషన్ అధికారులు కట్ట ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. జలాశయానికి గత నెలలో వచ్చిన భారీ వరదల నేపథ్యంలో గండిపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జలవిద్యుత్ కేంద్రం వద్ద భారీ గండిపడింది. ఆయకట్టుకు నీరందించేందుకు గండ్లను తాత్కాలికంగా మరమ్మ తులతో భాగంగా మట్టితో పూడ్చివేశారు. ఇదిలా ఉండగా నీటిమట్టం పెరిగిన పక్షంలో మట్టి కరి గిపోయి మళ్లీ గండిపడే అవకాశం ఉందంటూ అధికారుల దృష్టికి తీసుకవచ్చింది. దీంతో సోమ వారం కట్టను సుమారు 1.5 మీటర్ల ఎత్తు పెంచడంతోపాటు, సుమారు 3.5 మీటర్ల వెడల్పు చేస్తున్నారు. పనులను ఇరిగేషన్ ఈఈ మంగళంపూడి వెంకటేశ్వరరావు, డీఈ బానాల రమేష్ రెడ్డి పరిశీలించారు. కాల్వకట్ట వరద ఉధృతికి తట్టుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు సాయం రెట్టింపు

- జిల్లాలో 1100 మంది బాధితులు
- నవంబరు ఒకటి నుంచి అమలు

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): క్షయ సంబంధిత వ్యాధిగ్రస్తుల మరణాలను తగ్గించే లక్ష్యంతో భారత ప్రభుత్వం నిక్షయ పోషణ యోజన(ఎన్‌పీవై) ద్వారా పోషకాహార సహాయంను ఇప్పటి వరకు అందిస్తున్న దానిని రెట్టింపు చేస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో ఎన్‌పీవై ద్వారా రూ.500 పోషకాహార సహాయం వ్యాధిగ్రస్తులకు అందగా ఇక నుంచి రూ.1000 అందించనున్నారు. నవంబరు ఒకటి నుంచి ఈ పెరుగుదల అమల్లోకి వస్తుందని జాతీయ క్షయ విభాగం జాయింట్ కమిషనర్ డాక్టర్ సంజయ్ కుమార్ మట్టూ నుంచి వైద్యాధికారులకు అధికారిక సమాచారం వచ్చింది. క్షయవ్యాధి నిర్ధారణ సమయంలో సంబంధిత వ్యాధిగ్రస్తునికి రూ.3 వేలు, 84 రోజుల చికిత్స పూర్తయినంతరం మరో రూ.3 వేలు నగదును అందజేయనున్నారు. చికిత్స వ్యవధి ఆరు నెలలకు మించి ఉన్న క్షయ వ్యాధిగ్రస్తుల(లబ్ధిదారులు)కు రూ.1000 నిక్షయ పోషణ యోజన ద్వారా పోషకాహార సాయం అందించనున్నారు. 2024 నవంబరు ఒకటి లోపు నోటిఫై చేయబడిన రోగులందరికి రూ.1000 అందించనున్నట్లు తెలుస్తోంది.

రోగుల పోషకాహార స్థితి మెరుగుపర్చేందుకు చర్యలు

క్షయ రోగులకు రెండు నెలల పోషకాహార కిట్లను అందించనున్నారు. ఇది 18.5కిలోల కంటే తక్కువ ఉన్న ఎనర్జీ, డెన్స్, న్యూట్రిషియన్, సప్లిమెంటేషన్(ఈడీఎన్ఎస్)ని కూడా మంత్రిత్వ శాఖ అందించేందుకు ఆమోదించింది. క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ఔషధాలతో పాటు పోషకాహారాన్ని సైతం రెండు నెలల పాటు కిట్ల రూపంలో సంబంధిత లబ్ధిదారులకు అందజేయనున్నారు. అదేవిధంగా క్షయ రోగుల కుటుంబ సభ్యుల్లో క్షయ పోషకాహార లోప సంబంధిత దుర్బలత్వాన్ని పరిష్కరించేందుకు ప్రధానమంత్రి క్షయముక్తి భారత్‌అభియాన్(పీఎంటీబీఎంబీఏ) నిక్షయమిత్ర చొరవ కింద కుటుంబ సభ్యులను ఇందులో చేర్చి క్షయ ప్రబలకుండా నివారించేందుకు, అలాగే క్షయను తగ్గించే ఉద్దేశ్యంతో వారికి సైతం పోషకాహారంను అందించనున్నారు. ఇదిలా ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో క్షయ రోగులు 11 మంది ఉండగా సంవత్సరాంతానికి ఈ సంఖ్య 1800ల వరకు చేరే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మీ వల్లే పోడు పట్టాలు వచ్చాయి..

- మంత్రి తుమ్మల వద్ద సంతోషం వ్యక్తం చేసిన గిరిజన మహిళలు
- పంటలకు నీరు అందించి ఆదుకోవాలని కోరిన రైతులు


తుమ్మల వద్ద పోడు పట్టాలు చూపుతూ ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిజన మహిళలు

దమ్మపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మీ వల్లె పోడు పట్టాలు వచ్చాయని ములకపల్లి మండలానికి చెందిన పలువురు గిరిజన మహిళలు వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వద్ద సంతోషం వ్యక్తం చేశారు. గండుగులపల్లిలోని ఆయన నివాసం వద్ద మహిళలు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి పట్టాలు చూపిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాలో ఎన్నో సార్లు మొర పెట్టుకున్న తమకు పోడు పట్టాలు రాలేదని మంత్రి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మంగలిగుట్ట, తిమ్మంపేట, గుట్టగూడెం తదితర గ్రామాలకు చెందిన పోడు పట్టాలు పొందిన మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమరి వల్లే పట్టాలు వచ్చాయన్నారు. మండలంలో దాదాపు 600ఎకరాలకు పైగా పట్టాలు అందటంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేశారు. పోడు భూములతో వ్యవసాయ సాగుకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన తుమ్మల మాట్లాడుతు గిరిజన కుటుంబాలు ఆర్థికంగా బలపడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వసతులు కలిపిస్తుందన్నారు. అనంతరం అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి గ్రామానికి చెందిన రైతులు తుమ్మలను కలిసి తమకు పంట నష్టపరిహారం అందలేదని, పెదవాగుప్రాజెక్టు క్రింద సాగు చేసిన పంటలకు నీరు లేక ఎండిపోతున్నాయని వాపోయారు. దీనిపై స్పందించిన ఆయన నీటి పారుదల అధికారులకు ప్రాజెక్టు కింద ఉన్న రైతులకు పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నష్టపరిహారంపై మంత్రి తుమ్మల కొత్తగూడెం కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నష్టంపరిహారం అందకపోవటంపై చర్యలు తీసుకొని నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. అదే విధంగా మునగ సాగుకు విత్తనాలు ఎక్కడ నుంచి సరఫరా చేస్తున్నారని ఆరా తీసారు. లక్ష్యం నెరవేరే విధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంత్రిని కలిసినవారిలో కొయ్యల అచ్యుతరావు, బండి భాస్కర్, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, సుంకవల్లి వీరభద్రం, మోహన్‌రావు, నార్లపాటి మహేష్, అమరనాద్ తదితరులున్నారు.

చదువు చెల్లింపులకు బ్రేక్

- ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల కోసం ఎదురుచూపులు
- రూ.109 కోట్ల బకాయిలు అందక యాజమాన్యాల అవస్థలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూత పడిన డిగ్రీ, పీజీ కళాశాలలు
- నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన యాజమాన్యాలు



మూతపడిన డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ముందు నిరసనన వ్యక్తం చేస్తున్న యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో సోమవారం నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు మూతపడ్డాయి. తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజేస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం నుంచి నిరవధిక బంద్‌ను పాటిస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల సంఘం అధ్యక్షుడు ఎం. ప్రభాకర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సోమవారం ఉదయం జిల్లాలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలను మూసివేసి నిరసన వ్యక్తంచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.109 కోట్లకు పైగా రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు రావాల్సి ఉంది. అయితే ఇందులో రీయింబర్స్‌మెంట్ బకాయిలు అత్యధికంగా ఉన్నాయి.

పేరుకుపోయిన బకాయిలు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 40డిగ్రీ కళాశాలలు, ఆరు పీజీ కళాశాలలు ప్రస్తుతం నడుస్తున్నాయి. బీసీ, ఈబీసీ విద్యార్థులకు సంబంధించి 2021వ సంవత్సరం నుంచి మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.52కోట్ల54లక్షల,75వేల బకాయిలు రావాల్సి ఉంది. ఇక ఎస్సీ సంక్షేమ శాఖ నుంచి 2022-23, 2023-24 రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.30 కోట్లకు పైగానే ఉన్నాయి. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి రూ.6 కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి. మైనారిటీ సంక్షేమశాఖ రీయింబర్స్‌మెంట్స్ రూ. 21 కోట్ల34లక్షల87వేలు రావాల్సిఉంది. మొత్తం 109కోట్ల 89లక్షల62వేల బకాయిలు రావాల్సి ఉంది. ఆయా విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేసినప్పటికీ ఈ-కుబేర్ లో నిలిచిపోయాయి. దీంతో కళాశాలల ఖాతాల్లోకి నగదు జమ కాలేదు.

విద్యార్థుల అవస్థలు..

మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ఇక కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు చెబుతుండ డంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో విద్యార్థులు ఉన్నారు.

జీతాలు లేవు...

రూ.కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో ఆయా విద్యాసంస్థలు టీచింగ్, నాన్ టీచిం గ్ ఫ్యాకల్టీకి వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదు. కొన్ని విద్యాసంస్థల్లో ఐదారు నెలలకు పైగా వేతనాలు చెల్లించకపోవడంతో విద్యాబోధనపై సిబ్బంది అంతగా దృష్టి సారించడం లేదని సమాచారం. ఇక విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కూడా కుంటుపడుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి బకాయిలు వస్తేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థి సంఘాలు, యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. ఫీజు రీయింబర్స్ బకాయిలు రెండేళ్లుగా విడుదల కాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు కళాశాలల మూతకు సిద్ధమయ్యారు. రూ.కోట్లలో బకాయిలు ఉండటంతో కళాశాలల నిర్వహణకు ఇబ్బందిగా మారినట్లు తెలుస్తోంది. కనీసం బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఈ క్రమంలో విద్యాసంస్థల్లో బోధనను నిరవధికంగా బంద్ చేసేలా కార్యాచరణ రూపొందించి నిరవధిక బంద్‌ను పాటిస్తున్నారు.

క్రైం సమాచారం

గుండెపోటుతో యువతి కన్నుమూత



కరకగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన పోలెబోయిన కావ్య(23) అనే యువతి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతోంది. దసరా వేడుకలకు ఇంటికి వచ్చిన కావ్య మంగళవారం కాలేజీకి వెళ్లాల్సి ఉంది. ఈక్రమంలో ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు మణుగూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

చేపల వేటకెళ్లిన వ్యక్తి మృతి

దుమ్ముగూడెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటనపై దుమ్ముగూడెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. లింగాపురం గ్రామానికి చెందిన మట్ట వీరయ్య(45) ఈనెల 13న గౌరారంలోని తన అక్క వద్దకు వెళ్లి వరి పొలానికి కలుపు మందు కొట్టి వస్తానని ఇంటి నుంచి వెళ్లాడు. కలుపు మందు కొట్టిన అనంతరం గౌరారం చెరువులో చేపల వేటకు నీటిలో దిగాడు. చేపలు పడుతున్న క్రమంలో నీటిలో మునిగి ఊపిరాడక మృతిచెందాడు. వీరయ్య ఇంటికి చేరక పోవడంతో బంధువులు వెతుకుతున్న క్రమంలో చెరువులో మృతదేహం కనబడింది.

పురుగులమందు తాగి..

ఆళ్లపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న కలుపునివారణ మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతు సోమవారం మృతి చెందాడు. ఆళ్లపల్లి మండలం, పెద్దవెంకటాపురం(పాలగుంపు) గ్రామానికి చెందిన మొక్కటి కోస(31) తండ్రి మందలించాడని క్షణికావేశంలో ఈ నెల 9న కలుపునివారణ మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించి ప్రథమచికిత్స అందించి కొత్తగూడెం తీసుకెళ్లగా, అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు. వైద్యులు ఇంటికి తీసుకెళ్లండని సూచించడంతో, ఈ నెల 12న ఇంటికి తీసుకరాగా, సోమవారం మృతి చెందాడు.

బ్యాంకు అకౌంట్ హోల్డ్‌లో పెట్టారంటూ...
వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ములకలపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామంలో గల బ్యాంకు ముందు సోమవారం పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. మోటుగూడెం గ్రామానికి చెందిన బాదితుడు బడిపుటి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వెంకటేశ్వర్లు జగన్నాథపురం గ్రామంలో గల బ్యాంకులో అప్పు లేకపోయిన ఖాతా నిలిపి వేసినందుకు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయంపై బ్యాంకు అధికారి రమేష్‌ను వివరణ అడగ్గా అతనికి బ్యాంకులో ఖాతా లేదని, అతడి భార్య సుజాత ఖాతాను బంగారుతీగ గ్రామసమైఖ్య సభ్యురాలైన సుజాత స్త్రీనిధి రుణం వాయిదాలు ఏడాది నుంచి చెల్లించనందుకు వీవోఏ సూచన మేరకు బ్యాంకు ఖాతా నిలిపి వేసినట్లు తెలిపారు.

మూడు మందుపాతరల వెలికితీత

చర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చర్ల మండలం పూసుగుప్ప అడవుల్లో ఆదివారం సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ పోలీసులు మూడు మందుపాతరలు వెలికి తీశారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు పూసుగుప్ప అడవుల్లో కూబింగ్ నిర్వహిస్తున్నాయి. వేర్వేరు చోట్ల మూడు మందుపాతరలను గుర్తించగా బాంబ్‌స్క్వాడ్ సహాయంతో వాటిని వెలికి తీశారు. బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ విషయం చర్ల పోలీసులు వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

శ్రీరామ సేవ మరువం.. మరువం

- నేడే దాతల సత్కార కార్యక్రమం
- లాటరీ పద్ధతిపై జానకీసదనంలో దాతల గదుల కేటాయింపు
- సత్కార కార్యక్రమ కమిటీల ఏర్పాటు

భద్రాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం దాతల సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మారుతీ సదనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా భద్రాద్రి రామయ్యకు అన్నదానం, బంగారం, వెండి, వస్తువులు సమర్పణ, వసతి గదుల నిర్మాణం, భూవిరాళం ఇలా వివిధ రూపాల్లో రూ.లక్షకు పైబడి విరాళం సమర్పించిన దాతలను దేవస్థానం అధికారులు సన్మానించనున్నారు. ఇందుకోసం దేవస్థానం ఉద్యోగులతో సత్కార కార్యక్రమ నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేశారు. అలాగే సీనియర్ వైదిక సిబ్బందికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఇదే సమయంలో ఇటీవల నూతనంగా నిర్మించిన జానకీ సదనంలో గదులను లాటరీ ద్వారా దాతలకు కేటాయించేందుకు అధికారులు ఇప్పటికే కసరత్తు చేపట్టారు.

దాతల కోసం విస్తృత ఏర్పాట్లు

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దాతల సత్కార కార్యక్రమంకు విచ్చేయు దాతలకు రామయ్య దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. అలాగే సోమ, మంగళవారాల్లో ఇవో ఆదేశాల మేరకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో వసతి గదులు బ్లాక్ చేసి భకుర్తలకు అవసరమైన వసతి సదుపాయాన్ని కల్పిస్తున్నారు. కాగా దాతలకు ఒక కండువా, రెండు జాకెట్ పీసీలు, రెండు లడ్డూలు, స్వామి వారి చిత్రం(ఫోటో) ఉండేలా ఒక కిట్‌ను తయారు చేసి సిద్ధం చేశారు. దాతలకు వేదాశీర్వచనం సైతం అందించనున్నారు. ఇదే సమయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాతలకు దర్శనం అనంతరం అల్పాహారం, సత్కార కార్యక్రమం అనంతరం భోజన సదుపాయం కల్పించారు. ఇదిలా ఉండగా సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న దాతలకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఆత్మీయ ఆహ్వానంను అందించాలని ఇప్పటికే దేవస్థానం ఉద్యోగులను ఈవో ఎల్.రమాదేవి ఆదేశించారు.

అవి చిరుత పాద ముద్రలే...

- నిర్ధారించిన అటవీ శాఖ అధికారులు

జూలూరుపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని ఎర్రగుట్ట అటవీ ప్రాంతంలో రైతుల పొలాల్లో చిరుతపులి (పేత్నర్) సంచరించినట్లు ఎఫ్ఆర్‌వో ప్రసాదరావు తెలిపారు. రైతులు అందించిన సమాచారం మేరకు సోమవారం జూలూరుపాడు - తల్లాడ అటవీ రేంజ్ సరిహద్దులోని జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలో గల ఎర్రగుట్ట ప్రాంతాన్ని తన సిబ్బందితో సందర్శించారు. గుట్ట సమీపంలోని ఏన్కూరు మండలం ఒంటిగుడిసె మున్యాతండాకు చెందిన రైతుల పొలాల్లో అడవి జంతువు పాద ముద్రలను సేకరించి చిరుతపులి ముద్రలుగా గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకగిరి అటవీ ప్రాంతంలోని (పెద్దగుట్ట) నుంచి చిరుతపులి తప్పిపోయి వచ్చినట్లు తెలిపారు. రైతులు, ప్రజలు ఆందోళన చెందవద్దని అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి సమయాల్లో రైతులు పొలాలకు వెళ్లవద్దని తెలిపారు. చిరుత మళ్లీ తిరిగి కనకగిరి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోతుందని దాని జాడ కనిపించకుండా ఉండే వరకు, సిబ్బందితో కలిసి ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తామన్నారు. చిరుత సంచరించినట్లు తల్లాడ రేంజ్ సిబ్బందికి సమాచారాన్ని అందించడం జరిగిందని మంగళవారం నుంచి రెండు రేంజ్‌ల పరిధిలోని సిబ్బందితో కలిసి ప్రజలు భయాందోళనకు గురి కాకుండ 15రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి సమీప ప్రాంతాల ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎవరు చిరుతకు హాని తలపెట్టవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏపీవో గా వేణు



భద్రాచలం, అక్టోబరు 14: భద్రాచలం ఐటీడీఏలో ఏపీవో పవర్‌గా టి.వేణు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాచలం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏడీఈ ఆపరేషన్స్‌లో పని చేస్తున్న వేణు ఆ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు సహాయ ప్రాజెక్టు అధికారి(పవర్)గా బాధ్యతలు స్వీకరించారు. ఐటీడీఏ కార్యాలయంలో అటవీహక్కుల చట్టం విభాగంలో డీటీఆర్‌వోఎఫ్ఆర్(పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు)గా ఎం.లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ సహాయకులు(ఎలక్షన్) విభాగంలో విధులు నిర్వహిస్తూ డీటీఆర్‌వోఎఫ్ఆర్‌గా విధుల్లో సోమవారం బాధ్యతలు తీసుకున్నారు.

విద్యార్థులకు సత్వర చికిత్స అందించాలి

భద్రాచలం, అక్టోబరు 14: దసరా సెలవుల అనంతరం పాఠశాలలకు చేరుకునే గిరిజన విద్యార్థులు వాతావరణ మార్పులతో అనారోగ్య సమస్యలకు గురైతే సంబంధిత హెచ్ఎం, వార్డెన్లు గమనించి తప్పనిసరిగా వైద్య చికిత్సలు అందించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యల గురించి అర్జీలు సమర్పించడానికి వచ్చిన గిరిజనుల ఉంచి ఆయన వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఆర్సీవో నాగార్జునరావు, డీటీఆర్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోట మైసమ్మతల్లి జాతరకు పోటెత్తిన జనసందోహం

కారేపల్లి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో దసరా పండుగ సందర్భంగా ఐదురోజులపాటు జరుగున్న జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం రాత్రి అమ్మవారిని లక్షన్నరకుపైగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం ప్రారంభంమైన జాతరకు మూడవరోజుకూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. జాతరకు వర్షం లేకపోవండతోపాటు వాతవరణ అనుకూలిస్తుండటంతో ప్రజల జాతరకు భారీగా వస్తున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో 200 మంది పోలీసు సిబ్బందితో భారీబందోబస్తునిర్వహిస్తున్నారు. జాతరలో వచ్చేప్రజలకోసం వినోదాలను పంచేందుకు గతంకంటే ఈ ఏడాది అనేక రకాలస్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. వినోదాలకోసం భారీగా తరలివస్తుండటంతో ఆ ప్రాంతంలో ఇసుకవేస్తే రాలనంతగా జనంఉండటం విశేషం. స్టాల్స్‌వద్ద బొమ్మలు కొనుగోలు చేసేందకు పిల్లలు, పెద్దలు, పోటీపడుతున్నారు. మరో రెండు రోజుల పాటు ఈ మహాజాతర జరగనుంది


జెయింట్ వీల్స్, డ్రాగెన్ ట్రైన్‌వద్ద సందడిచేస్తున్న ప్రజలు

కేఓసీ ఓబీ కంపెనీ పై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందు టౌన్/టేకులపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియా పరిధిలోని కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఓబీ పనులు చేస్తున్న ఎల్ఎస్ఎన్ ఓబీ కంపెనీపై చర్యలు తీసుకోవాలని టేకులపల్లి రాజకీయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందు ఏరియా సింగరేణి అధికారులు, డీఎస్పీలకు వినతిపత్రాలు అందచేశారు. నాయకులు మాట్లాడుతూ ఓబీలో కార్మికులకు వేతనాలు సకాలంలో ఇవ్వడంలో ఓబీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఏడాది కాలంగా కాంట్రాక్టు కార్మికులను అనేక ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని లేనియెడల కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టి నూతనంగా టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు లక్కినేని సురేందర్‌రావు, భూక్య దల్‌సింగ్‌నాయక్, బి. ప్రసాద్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సమాచారం

పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్లు

సీపీ కార్యాలయం	87126 59260
సీపీ క్యాంప్ కార్యాలయం	87126 59246
సీపీ సీసీ	87126 59245
పీఆర్‌వో	87126 59256
టాస్క్‌ఫోర్స్ ఏసీపీ	87126 59180
సీసీఎస్ ఏసీపీ	87126 59185
సీఎస్‌బీ ఏసీపీ	87126 59200
ట్రాఫిక్ ఏసీపీ	87126 59209
ట్రాఫిక్ స్టేషన్	87126 59212
సైబర్ సెల్	87126 59219
సీఐ కమాండ్ కంట్రోల్	87126 59228
ఉమెన్ సేఫ్టీ కంట్రోల్ రూమ్	87126 59222
ఖమ్మం నగర పరిధి..	
ఖమ్మం టౌన్ ఏసీపీ	87126 59105
ఖమ్మం వన్‌టౌన్ సీఐ	87126 59106
ఖమ్మం వన్‌టౌన్ స్టేషన్	87126 59107
ఖమ్మం టూటౌన్ సీఐ	87126 59110
ఖమ్మం టూటౌన్ స్టేషన్	87126 59112
ఖమ్మం త్రీ టౌన్ సీఐ	87126 59115
ఖమ్మం త్రీటౌన్ స్టేషన్	87126 59116
ఖమ్మం ఖానాపురం సీఐ	87126 59119
ఖమ్మం ఖానాపురం స్టేషన్	87126 59120
మహిళ పోలీస్‌స్టేషన్ సీఐ	87126 59196
మహిళ పోలీస్ స్టేషన్	87126 59197
ఖమ్మం రూరల్ పరిధి..	
ఖమ్మం రూరల్ ఏసీపీ	87126 59124
ఖమ్మం రూరల్ సీఐ	87126 59125
ఖమ్మం రూరల్ ఎస్‌హెచ్ఓ	87126 59126
ఖమ్మం రూరల్ స్టేషన్	87126 59127
ముదిగొండ ఎస్ఐ	87126 59129
ముదిగొండ స్టేషన్	87126 59130
సీఐ కుసుమంచి	87126 59132
కూసుమంచి ఎస్సై	87126 59133
కుసుమంచి స్టేషన్	87126 59134
తిరుమలాయపాలెం ఎస్సై	87126 59136
తిరుమలాయపాలెం స్టేషన్	87126 59137
నెలకొండపల్లి ఎస్సై	87126 59138
నెలకొండపల్లి స్టేషన్	87126 59139
సింగరేణి సీఐ	87126 59140
కారేపల్లి ఎస్సై	87126 59141
కారేపల్లి స్టేషన్	87126 59143
కామేపల్లి ఎస్సై	87126 59144
కామేపల్లి స్టేషన్	87126 59145
రఘునాథపాలెం ఎస్సై	87126 59217
రఘునాథపాలెం స్టేషన్	87126 59218
వైరా పరిధి..	
ఏసీపీ వైరా	87126 59146
సీఐ వైరా	87126 59147
వైరా ఎస్సై	87126 59148
వైరా స్టేషన్	87126 59149
కొణిజర్ల ఎస్సై	87126 59150
కొణిజర్ల స్టేషన్	87126 59151
చింతకాని ఎస్సై	87126 59152
చింతకాని స్టేషన్	87126 59153
తల్లాడ ఎస్సై	87126 59154
తల్లాడ స్టేషన్	87126 59155
బోనకల్ ఎస్సై	87126 59156
బోనకల్ స్టేషన్	87126 59157
సీఐ మధిర	87126 59158
మధిర టౌన్ ఎస్సై	87126 59159
మధిర టౌన్ స్టేషన్	87126 59160
మధిర రూరల్ ఎస్సై	87126 59162
మధిర రూరల్ స్టేషన్	87126 59163
ఎర్రుపాలెం ఎస్సై	87126 59164
ఎర్రుపాలెం స్టేషన్	87126 59165
కల్లూరు పరిధి..	
ఏసీపీ కల్లూరు	87126 59166
ఎస్‌హెచ్‌వో సత్తుపల్లి	87126 59167
సత్తుపల్లి స్టేషన్	87126 59168
కల్లూరు ఎస్సై	87126 59171
కల్లూరు స్టేషన్	87126 59172
వేంసూరు ఎస్సై	87126 59174
వేంసూరు స్టేషన్	87126 59175
వీఎం బంజర ఎస్సై	87126 59176
వీఎం బంజర స్టేషన్	87126 59177
ఏన్కూరు ఎస్సై	87126 59178
ఏన్కూరు స్టేషన్	87126 59179

పోలీసు సిబ్బంది తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు..

- భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

జూలూరుపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది తొందరపాటు నిర్ణయాలు తీసుకుని ప్రాణాలు పోగొట్టుకోవద్దని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.

కానిస్టేబుల్ సాగర్ మృతికి సంతాపాన్ని తెలియచేసేందుకు ఆయ న ఏన్కూరు వెళ్తు జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కొద్దిసేపు ఆగారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, సిబ్బందితో మాట్లాడారు. కేసుల పూరోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు వేదింపులకు గురి చేస్తే సిబ్బంది తన దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బందికి ఏమైన సమస్యలు ఉంటే నేరుగా తనను కలిసి తెలియచేయాలని వాటిని పరిష్కరించేవిధంగా కృషి చేస్తానన్నారు. ఆ తర్వాత సిబ్బందితో కలిసి ఏన్కూరుకు వెళ్లారు.

ఎలక్ట్రీషియన్, టైలరింగ్, బ్యూటీషియన్‌లో గిరిజనులకు ఉచిత శిక్షణ

భద్రాచలం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి: భద్రాచలంలోని ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి జిల్లాలోని గిరిజన యువతకు అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, టైలరింగ్(మహిళలకు మాత్రమే), రైతులకు తేనెటీగల పెంపకం కోర్సుల్లో ఉచిత శిక్షణను కల్పించనున్నట్లు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పీవో బి.రాహుల్ తెలిపారు. శిక్షణ పొందే వారు 18 నుంచి 35 సంవత్సరాల కలిగి, ప్రాథమిక విద్యాభ్యాసం 5 నుంచి 8వ తరగతి వరకు చదివి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తగిన ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 18న ఐటీడీఏలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 6302608905, 8143840906 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అధికంగా పెండింగ్ ఉన్న ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలన్నారు. దీనికోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలో పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులపై మండల ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పని చేసే ప్రభుత్వ అధికారుల, సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ తక్కువ నమోదు కావడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందే వారికి కలెక్టరేట్ సమావేశం మందిరంలో సన్మానించడం, రిటైర్మెంట్ రోజే బెనిఫిట్స్ అందేవిధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారని, దీనికి సంబంధించి జిల్లా అధికారులు తమ కార్యాలయ పరిధిలో రిటైర్ అయ్యే వారి వివరాలు నిర్దేశిత ఫార్మాట్‌లో అందజేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్ష రైనా, డీఆర్డీవో. సన్యాసయ్య, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారం చూపని ప్రజావాణి

- వరుసగా మూడు వారాలు వినతిపత్రాలతో ప్రజలు
- అధికారులపై ఆసహనం వ్యక్తం చేసిన ఫిర్యాదుదారులు
- ప్రజావాణిలో వినతులు స్వీకరించిన కమిషనర్ అభిషేక్ ఆగస్త్య



వినతిపత్రం అందిస్తున్న ఫిర్యాదుదారులు

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఒకటి రెండు వారాలు కాదూ మూడు వారాలుగా ప్రజావాణికి వస్తున్నాం.. కానీ మా సమస్యకు పరిష్కారం మాత్రం చూపలేదని పలువురు ఫిర్యాదుదారులు వాపోయారు. వృద్ధాప్యంలో కాళ్ల అరిగేలా కార్యాలయం చుట్టూ తిరుగు తున్నామని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్యకు గోడు వెల్లబోసుకున్నారు. సోమవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆధ్వర్యంలో ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. అత్యధిక ఫిర్యాదులు అక్రమ కట్టడాలు, రహదారులు ఆక్రమణలు, సీసీ రహదారులకు మించిన ఎత్తులో డ్రైనేజీల నిర్మాణాలు, సర్వే పూర్తి జరిగిన నేటి వరకు మున్నేరు వరద బాధితులకు సహాయం అందలేదని ప్రజలు కమిషనర్‌కు వినతి పత్రాలను అందించారు. అక్రమ కట్టడాలపై వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ సిరియస్‌గా స్పందించారు. వెంటనే నోటీసులు జారీ చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, జనన, మరణాలు, పారిశుధ్యం, టౌన్‌ప్లానింగ్ పలు విభాగాల అధికారులు ఖచ్చితంగా ల్యాప్‌టాప్‌లతో ప్రజావాణిలో పాల్గొనాలని కమిషనర్ అభిషేక్ ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్, ఈఈ కృష్ణలాల్, డీసీపీ వికాస్, ఆర్వో శ్రీనివాసరావు, మేప్మా టీపీఎం సుజాత, ఎకౌంట్స్ అధికారి శివలింగం, ఆర్ఐ జ్యోతి పాల్గొన్నారు.

మున్నేరుకు వరద వస్తే.. ఆ డివిజన్‌కు వణుకే

- ఏటా ఇబ్బందిపడుతున్న 48వ డివిజన్ ప్రాంత ప్రజలు
- మురికి గుంతలు, ఇష్టారాజ్యంగా లారీల ట్రాఫిక్
- కాల్వఒడ్డు నుంచి దానవాయిగూడెం వరకు అభివృద్ధికి ఆమడదూరం



ఇటీవల మున్నేరు వరదలకు ఇళ్లల్లోకి చేరిన వరద



మట్టి రోడ్లతో 48వ డివిజన్ ఆటో నగర్

ఖమ్మంమార్కెట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరానికి నడిబొడ్డున ఉండి కూడా అభివృద్ధి ఆమడ దూరంలో ఉంది 48వ డివిజన్ ప్రాంతం. సుమారు 10వేల జనాభా, 5200 ఓట్లు కలిగిన ఆ ప్రాంతం నుంచి ప్రభుత్వానికి పన్నుల రూపేణా భారీగా ఆదాయం అందిస్తున్నా.. అభివృద్ధికి దూరంగా ఉందనే విమర్శలు ఉన్నాయి. అందించట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అస్తవ్యస్త రోడ్లు, పూడిక తీయని డ్రెయినేజీలు, సగంలోనే వదిలేసిన సెంట్రల్ లైటింగ్ ఆ ప్రాంతాన్ని వెనుకబాటుకు గురి చేస్తున్నాయంటూ స్థానికులు పేర్కొంటున్నారు. డివిజన్‌లోని ఆటోనగర్ ప్రాంతంలో అసలు చూడటానికి ఒక్క సీసీరోడ్డైనా కనిపించకపోవడం గమనార్హం. ఎక్కడ చూసినా మురికి గుంతలు, ఎఫ్‌సీఐ రోడ్డులో ఇష్టారాజ్యంగా లారీల ట్రాఫిక్, దొంగల హల్‌చల్ ఇవన్నీ ఆ ప్రాంత ఇమేజ్‌ను మసక బారుస్తున్నాయని పలువురు చెబుతున్నారు. నగరంలో ప్రధాన కూడలి అయిన కాల్వఒడ్డు నుంచి మొదలు పెడితే దానవాయిగూడెం వరకు విస్తరించిన సదరు డివిజన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మున్నేరు పరివాహక ప్రాంతం

వైశాల్యంలో నగరంలోని అన్ని డివిజన్ల కంటే కాస్త భిన్నంగా కనిపించే ఈ డివిజన్ శిఖంలో పూర్తిగా 90శాతానికి పైగా మున్నేరు ప్రవహిస్తూ ఉంటుంది. డివిజన్లో వెంకటేశ్వరనగర్, పద్మావతి నగర్, పద్మావతినగర్-1, పద్మావతినగర్-2, ఆటోనగర్, గణేష్‌నగర్, మేకలనారాయణనగర్, అంబేత్కర్‌నగర్, సారథీనగర్ తదితర ప్రాంతాలను కవర్ చేస్తుంది. దీంతో మున్నేరుకు వరద వచ్చినప్పుడల్లా మొదటగా ఇబ్బంది పడేది ఈ ప్రాంత వాసులే.. ఇటీవల వచ్చిన అధిక వర్షాలకు, వరదలకు చాలా వరకు నష్టపోయిన ప్రాంతంగా రికార్డుల్లోకి ఎక్కింది. నగర నడిబొడ్డు కాల్వొడ్డు దగ్గర నుంచి మొదలు పెడితే శివారులో ఉన్న దానవాయిగూడెం వరకు ఉన్న ఈ ప్రాంతం అభివృద్ధి విషయంలో ఎంతో వెనకంజలో ఉంది.

డివిజన్ విజిట్

ఒక్క సీసీ రోడ్డు లేని ఆటోనగర్

నగరానికి ఆటోనగర్ అనేది ఒక పారిశ్రామిక ప్రాంతంగా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు అందించే ప్రాంతంగా ఉంటుంది. సిటీలో వాహనాలు రిపేర్ చేస్తున్నపుడు వచ్చే సౌండ్ పొల్యూషన్, పొగ, కెమికల్ వాసనలు రాకుండా కాస్త సిటీకి దూరంగా ఆటోనగర్ ప్రాంతాన్ని ప్రత్యేకంగా నిర్మిస్తారు. ఇక్కడ ప్రాంతంలో ఆటోనగర్ నిర్మాణానికి కేటాయించి, అక్కడ వాహన రిపేరు పనులు జరుగుతూ దాదాపు 15 సంవత్సరాలు గడిచినా ఇంతవరకు ఒక్క సీసీ రోడ్డు కూడా ఆప్రాంతంలో నిర్మించలేదంటే అతిశయోక్తి కాదు. అంతే కాకుండా అక్కడ మోటర్ సైకిల్‌కూడా వెళ్లని పరిస్థితి నెలకొంది.

రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం అత్యంత ఆవశ్యకత

మున్నేరు వరద వచ్చినపుడు ఎక్కువగా ఇబ్బందిపడే ఇక్కడి ప్రాంత వాసులకు ముఖ్యంగా డ్రెయినేజీ, అంతర్గత రోడ్లు అత్యంత ఆవశ్యకంగా ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం 2016- 2021లో నాటి ప్రభుత్వం రూ. 7.50 కోట్లు కేటాయించగా, 2021 నుంచి ఇప్పటి వరకు సుమారు మూడున్నర సంవత్సరాలలో రూ. ఒక కోటి మాత్రమే విడుదల చేసింది. నిధులు విడుదల లేమితోనే అభివృద్ధి జగరట్లేదని స్థానిక కార్పోరేటర్ తోట ఉమారాణి పేర్కొంటున్నారు. కాల్వొడ్డు ప్రాంతనం నుంచి రోడ్డు విస్తరణ చేపట్టి ఎంటీ గార్డెన్స్ వరకు సెంట్రల్ లైటింగ్ పూర్తి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

48వ డివిజన్ వివరాలు

ప్రాంతం వైశాల్యం: సుమారు 3 కిలోమీటర్లు

ప్రాంతంలోని ఏరియాలు: 9 (వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, పద్మావతినగర్-1, పద్మావతినగర్-2, ఆటోనగర్, గణేష్‌నగర్, మేకల నారాయణనగర్, అంబేత్కర్‌నగర్, సారథీనగర్)

జనాభా: సుమారు 10,000 మంది

ఓటర్లు: సుమారు 5,200 మంది

అభివృద్ధికి సహకరించాలి

తోట ఉమారాణి, 48వ డివిజన్ కార్పోరేటర్



ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి. డివిజన్‌లోని అన్ని ప్రాంతాలలో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడానికి నిధులు విడుదల చేయాలి. మున్నేరు వరదల నుంచి రక్షించాలి. 48వ డివిజన్‌కు గత డిసెంబరు నుంచి ఇంతవరకు వార్డు, జనరల్ ఫండ్ రూపాయ కూడా విడుదల చేయలేదు. దీంతో అభివృద్ధికి అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి.

ఒక్క రేషన్ షాపు కూడా ఏర్పాటు చేయలే

జి.వెంకన్న మేకల నారాయణనగర్



నూతన బస్టాండ్, రైల్వేస్టేషన్‌కు అతి చేరువలో ఉన్న మేకలనారాయణనగర్, గణేష్ నగర్‌లలో ఇప్పటి వరకు రేషన్ షాపును అధికారులు ఏర్పాటు చేయలేదు. రేషన్ కోసం ప్రతీనెల సుమారు 3కిలోమీటర్లు వెళుతున్నాం. మాప్రాంతానికి దక్షిణం వైపు బైపాస్ రోడ్డు, తూర్పు వైపు రైల్వే లైను, ఉత్తరం వైపు సాగర్ కాలువ, పశ్చిమాన మున్నేరు దగ్గర దగ్గరగా ఉండి నాలుగు వైపులా బంధించి ఉండటం వల్ల మా ప్రాంతం అభివృద్ధి చెందట్లేదు.

మౌలిక వసతులు కల్పించాలి

కొప్పుల లక్ష్మణ్, సారథీనగర్



48వ డివిజన్ మొత్తం కూడా కొంత మేర అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు ఉన్నా ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో కనీసం ఒక్క సీసీ రోడ్డు, డ్రెయినేజీ కూడా లేదు. ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతులు కల్పిస్తే ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందుతుంది. రాజకీయ నాయకులు, ఈ ప్రాంత పాలకులు అభివృద్ధి చేసి మోడల్ డివిజన్‌గా రూపొందించాలి. అధికారులు నిధులు విడుదల చేయాలి.

పాత సీపీఎం రహదారిని వన్‌వేగా మార్చాలి

- ట్రాఫిక్ ఏసీపీకి సీపీఎం నాయకుల వినతి



ట్రాఫిక్ ఏసీపీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ఖమ్మంటౌన్,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పాతసీపీఎం ఆఫీస్ రహదారిని వన్‌వేగా మార్చాలని కోరుతూ సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ట్రాఫిక్ ఏసీపీ బీ. శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. నగరంలోని సిటీ బస్టాండ్, రైల్వేష్టేషన్, కమాన్ బజార్ వెళ్లడానికి ప్రధాన రహదారిగా, ఈ రహదారి ఉందని, ఫలితంగా వాహనాల రద్దీతో తరచూ ట్రాఫిక్‌జామ్ అవుతున్నదని వివరించారు. ప్రధానమైన ఆస్పత్రులు ఉన్నాయని, చిన్న రహదారి కావటంతో ద్విచక్ర వాహనదారులు కూడా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని ట్రాఫిక్ ఏసీపీకి వివరించారు. అంబులెన్స్‌లు వెళ్లడానికి కూడా ఇబ్బందులు కలుగుతున్నా యన్నారు. ఎన్నెస్పీ రహదారి నుంచి వచ్చే వాహనాలు ఈవైపుగానే వెళుతున్నాయని, దాంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటం లేదన్నారు. ట్రాఫిక్ ఏసీపీకి వినతి పత్రం ఇచ్చినవారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్, టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, ఉపేందర్, సీహెచ్. భద్రం, బీ.సాగర్, గుమ్మడి భిక్షం తదితరులున్నారు.

టీఎన్జీవో నగర కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా రమణయాదవ్



నూతన కమిటీతో టీఎన్జీవో నేతలు

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): టీఎన్జీవో ఖమ్మం నగర నూతన కమిటీ అధ్యక్షుడిగా రమణయాదవ్, వీరాంజనేయులు ఎన్నికయ్యారు. సోమవారం టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో ఖమ్మం నగర యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. ఈఎన్నికలకు పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రాయల నరసింహారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. వారం రోజుల ప్రక్రియ అనంతరం అధ్యక్ష, కార్యదర్శి పదవులకు నామినేషన్లు రాకపోవడం, ఒకే ఒక్క సెట్ నామినేషన్లు రావడంతో కార్యవర్గం ఎన్నిక మొత్తం ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఇలా :

ఖమ్మం నగర యూనిట్ అధ్యక్షుడిగా చంద్రకాని రమణయాదవ్, కార్యదర్శిగా పోలవరపు వీరాంజనేయులు కోశాధికారిగా కొప్పుల దిలీప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు మరో 12మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన ప్రకటించారు. ఎండి రఫీ, నెల్లూరి రవికుమార్, ఎం.శ్వేత కే.ప్రసన్నకుమార్, వి.శంకర్రావు,టీ.కాంతారావు, ఐ. కిరణ్ కుమార్, ఎం. ఉదయ్ భాస్కర్ ఎస్. శ్రావణి, ఎన్. పృథ్వీ, కే.పవన్ కుమార్ సిహెచ్, ప్రవీణ్ యూనిట్ సభ్యులుగా ఎన్నికయ్యారు.ఈ కమిటీ పదవీ కాలం మూడు సంవత్సరాల పాటు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు ఎన్నికల అధికారి ఎన్నిక పత్రాన్ని అందజేశారు. వీరిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆడహాక్ కమిటీ సభ్యులు ఎస్.జయపాల్, గుంటుపల్లి శ్రీనివాస్, కొమరగిరి దుర్గాప్రసాద్, ఎర్రా రమేష్, ఆయుష్ ప్రకాష్, తాళ్లూరి శ్రీకాంత్, బుసాచంద్ర శేఖర్,పెద్దినేని రాధా కృష్ణ, ముఖీద్, మన్మధరావు పాల్గొన్నారు.

19న నాగన్నకు సుద్దాల పురస్కారం

ఖమ్మంసాంస్కృతికం,అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరానికి చెందిన ప్రముఖగాయకుడు నాగన్నకు ప్రముఖ సినీ గేయరచయత సుద్దాల అశోక్ తేజ స్థాపించిన సుద్దాల హనుమంతు, జానకమ్మ జాతీయ పురస్కారాన్ని ఈనెల19 సాయంత్రం 6గంటలకు హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో అందజేయనున్నారు. ప్రజాకళాకారుడిగా అరుణోదయ సాంస్కృతిక సంఘంలో చురుగ్గా పనిచేసిన నాగన్న విప్లవగాయకుడిగా పేరొందారు. సాహిత్య కళారంగాల్లో ఆయన చేసిన సేవలకు ఈ అవార్డును ప్రకటించారు. పురస్కార సభకు సంబంధించిన బ్రోచర్‌ను ఇటీవల జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సాహిత్య సభ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ ఆవిష్కరించారు.

వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇతర పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేయుటకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు కోరారు. అక్టోబరు19లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు అసిస్టెంట్ ప్రొఫెసర్లు (రేడియోడయాగ్నాసిస్, ఫార్మకాలజి, కమ్యూనిటీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్, రెస్పిరేటరీ మెడిసిన్), ఐసీయూ సేవలు అందించగల ఐదు సీఏఎస్ స్పెషలిస్ట్ (అనేస్థిషియా, 2 జనరల్ మెడిసిన్, 2 పల్మనరీ మెడిసిన్) పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయుటకు నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు అక్టోబరు 15 నుంచి అక్టోబరు19లోపు ఆన్ లైన్,ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబరు21న ఇంటర్వ్యూ ద్వారా నియమిస్తామన్నారు.

పంటలకు మద్దతు ధర

తిరుమలాయపాలెం,అక్టోబరు14,(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కలిపిస్తుందని ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రత్యేక అధికారి సుమన్‌చక్రవర్తి తెలిపారు. సోమవారం మండలంలోని జల్లేపల్లి, జూపెడ గ్రామాల్లో డీఆర్డీవో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయనప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, ఏవో ఎన్.సీతారామిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, ఏపీఎం అలివేలుమంగ, స్థానికులు పోట్లకిరణ్, పోట్ల జగదీష్, వెంకయ్య పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించండి

వైరా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రవికుమార్

నేలకొండపల్లి,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):సమగ్ర వ్యవసాయ పద్ధతులను ఆచరించటం ద్వారా అధిక దిగుబడులను సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం, వైరా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ రైతులకు సూచించారు. శాస్త్రవేత్త ఫనిశ్రీ, మండల వ్యవసాయాధికారులతో కలిసి రవికుమార్ సోమవారం మండల పరిధిలోని చెన్నారం, రాజేశ్వరపురం గ్రామాల్లోని వరి క్షేత్రాలను పరిశీలించారు. పొలాల్లో ఆశించిన పలు తెగుళ్ళను గమనించి రైతులకు నివారణా పద్ధతులను సూచించారు.వరి పంటలో సుడిదోమ ఆశించినట్లు గమనించామని దీని నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి దేశబోయిన అరుణ కుమారి, ఏఈఓ దుర్గాభవాని, రైతులు యలమద్ది లెనిన్, బోనగిరి కిరణ్, నెల్లూరి పిచ్చయ్య, పోలంపల్లి ఉపేందర్, దండా రామారావు తదితరులు పాల్గొన్నారు.

20న టీయూసీఐలో ఇఫ్టూ విలీనం

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు జాతీయ స్థాయిలో చర్చలు జరగటం ద్వారానే శాశ్విత పరిష్కారం దక్కుతుందని, అందుకే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం జరగటం చారిత్రక అవసరమని ఐఎఫ్‌టీయూ నాయకులు కే శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు మొలకలపల్లి లక్ష్మీనారాయణ, బొమ్మకంటి రమేశ్, పెరబోయిన వెంకన్న, కాదూరు శ్రీను, భూక్య రవినాయక్, తిరుపయ్య, రవి, కే నాగరాజు, కుమార్ పాల్గొన్నారు.

మధుకాన్ షుగర్స్‌లో మహా పడిపూజ



నేలకొండపల్లి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మధుకాన్ షుగర్స్ ఎండీ నామా కృష్ణయ్యస్వామి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి మధుకాన్ షుగర్స్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. పాకతిల్లం నారాయణ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గాయకుడు జి.శ్రీనివాస్‌కుమార్(డప్పు శ్రీను గురుస్వామి)ఆలపించిన పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నామా కృష్ణయ్య సోదరుడు, బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు, సోదరులు రామారావు, సీతయ్య, కుటుంబ సభ్యులు వందల సంఖ్యలో అయ్యప్ప స్వాములు, చెరుకు రైతులు పాల్గొన్నారు.





ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి: ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నూతన ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సోమవారం కల్లూరులో సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో యుటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన ఉపాధ్యాయుల అభినందన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు యస్‌కే రంజాన్, వి.వి రామారావు, రమేష్, వీరస్వామి, రాయాలనాగేశ్వరరావు, విజయకుమార్, చక్రవర్తి, ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, బాగం ప్రభాకరచౌదరి, భూక్యా శివకుమార్‌నాయక్, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనువాసరావు పాల్గొన్నారు.

వైరా: మండల పరిధిలోని సిరిపురం కేజీ గ్రామంలో సోమవారం నూతన ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన యువకులకు సామాజిక కార్యకర్త షేక్. లతీఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మట్టూ రి కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కనకరత్నం, సత్యనారాయణ, చిన్న పెద్దల, నర్సయ్య, కిరణ్‌కుమార్, వీరభద్రం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ మెటీరియల్స్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


వేంసూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి


గన్నవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కస్తాల సత్యనారాయణ


కొర్లగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ నీరజదేవి

▸▸ ఎమ్మెల్యే మట్టా రాగమయి

వేంసూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం మండలంలోని భీమవరం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దార్ ఎంఏ.రాజు, ఎంపీడీవో రమాదేవి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, భాస్కర్, ప్రసాదరాజు, చెన్నారావు, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, సోమిరెడ్డి, చిట్టిబాబు, తుంబూరు రామిరెడ్డి, రేగళ్ల శ్రీనివాసరెడ్డి, అక్కినేని నరేంద్ర, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, కరుణాకర్‌రెడ్డి, యర్రా సత్యనారాయణ, డి.సురేష్, రమేష్, కోట సత్యనారాయణ, మేడా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి: సన్న రకం వరి ధన్యానికి దేశ చరిత్రలోనే మొదటి సారి రూ.500 బోనస్ ఇస్తున్న ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం సదాశివునిపాలెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యం లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు

వైరా: మండలంలోని గన్నవరం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ డీడీ, మండల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఏవో మయాన్ మంజూఖాన్, ఎంపీవో జ్యోత్స్నదేవి, ఐకేపీ ఏపీఎం శ్యాంకుమార్, వైరా సొసైటీ డైరెక్టర్ యన్నం కోటారెడ్డి, రైతులు బండి వెంకటేశ్వర్లు, కొణతాలపల్లి నాగేశ్వరరావు, కోరె కృష్ణ, రంగిశెట్టి కృష్ణ, వన్నపరపు ఏడుకొండలు పాల్గొన్నారు.

కారేపల్లి: మండల పరిధిలోని మాధారం గ్రామంలో వరిధాన్యం కొనుగోలు చేసే కేంద్రాన్ని సోమవారం మండల స్పెషల్ ఆఫీసర్ కె.నవిన్‌బాబు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సంపత్ కుమార్, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్, ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సీసీ సోంద్‌సాహెబ్, పాల్గొన్నారు.

బోనకల్: ప్రభుత్వ మద్దతు ధర కోసం రైతులు తప్పనిసరిగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే తమ పంటను విక్రయించాలని మండల ప్రత్యేకాధికారి విజయభాస్కరరెడ్డి సూచించారు. మండల కేంద్రంలో సోమవారం సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నమ్ చందర్, ఏవో విజయభాస్కరరెడ్డి, ఏపీఎం పద్మలత, ఎంపీవో శాస్త్రీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, యువనేత బీపీ నాయక్, బండి వెంకటేశ్వర్లు, మరీదు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కల్లూరు: మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామంలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, బాగం ప్రభాకరచౌదరి, భూక్యా శివకుమార్‌నాయక్, మట్టా రామకృష్ణ, పెద్దబోయన శ్రీనువాసరావు, ఎస్‌కే తురాబలి, లక్ష్మారెడ్డి, ఎలమరెడ్డి వెంకటరెడ్డి, మట్టా వెంకటేశ్వర్లు తదితరులున్నారు.


బోనకల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి విజయభాస్కర్‌రెడ్డి


మాధారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి నవీన్‌బాబు

వీరయ్య ఆశయాలు సాధించాలి

▸▸ డిప్యూటీ సీఎం భట్టి సతీమణి మల్లు నందిని


గుత్తా వీరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మల్లు నందిని

వైరా, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరం గ్రామంలో ఉన్న శ్రీకోదండ రామాలయస్వామి ఆలయానికి రూ.కోటి విలువైన మూడున్నర ఎకరాల భూమిని దానం చేసిన గుత్తా వీరయ్య ఆశయాలు సాధించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని అన్నారు. ఆదివారం రాత్రి గ్రామంలో వీరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. గత ఆరునెలల కిందట అనారోగ్యంతో వీరయ్య మృతి చెందారు. వీరయ్య దంపతులకు సంతానమైన కుమార్తె చిన్నవయస్సులోనే మృతిచెందడంతో తన భూమిని ఆలయానికి దానంగా ఇచ్చారు. మాజీ సర్పంచ్‌లు సాదం రామారావు, దాసరి దానియేలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా ఏఎంసీ మాజీ చైర్మన్ పసుపులేటి మోహన్‌రావు, గుత్తా వెంకటేశ్వర్లు, శీలం వెంకట్రామిరెడ్డి, గుత్తా రామారావు, నర్సింహారావు, పల్లపు కొండలు, మట్టూరి కృష్ణారావు, వేల్పుల మురళీ, చల్లా సతీష్, బత్తుల శ్రీను, రామకృష్ణ, శ్యాంసుందర్, సురేష్ పాల్గొన్నారు.

జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

ఎర్రుపాలెం: జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారికి, అమ్మవారికి నందిని పట్టువస్త్రాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, యూత్ కాంగ్రెస్ జిల్లా నేత వెజండ్ల సాయికుమార్, అయిలూరి రంగారెడ్డి తదితరులున్నారు.

వైరా: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గరికపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు శీలం సురేందర్‌రెడ్డి, వైరా మండల నాయకులు శీలం వెంకట్రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పాలేటి నర్సింహారావు, పల్లపు కొండలు, మట్టూరి కృష్ణారావు, తడికమళ్ల ఏసోబు పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం లేకుండా ఇందిరమ్మ కమిటీలు వేయాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న నాగేశ్వరరావు

తల్లాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజకీయ జోక్యం లేకుండా ఇందిరమ్మ కమిటీలను వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం తల్లాడలోని దొడ్డా కృష్ణయ్య భవనంలో శీలం సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు ఇచ్చే ఇళ్ల పథకంలో రాజకీయ జోక్యం సరైంది కాదన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సీపీఎం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, తాతా భాస్కర్‌రావు, ఐనాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, శీలం పకీరమ్మ, సత్తెనపల్లి నరేష్, పులి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

ముదిగొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం మాధాపురంలోని వరి పంటలను వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు పణి శ్రీ, ఏవో సరిత, ఏఈవోలు, పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

సత్తుపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం-2020పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ రవిబాబు తెలిపారు. 2020లో రూ.వెయ్యి చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసిన వారికి సంబంధించి ప్రాసెసింగ్ చేపట్టినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుందన్నారు. జీపీఎస్ ద్వారా అధికారులు వివరాలు నమోదు చేస్తారని, ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు వినియోగించుకోవాలని కోరారు.

శాంతమ్మ ఆశయాలు సాధించాలి

కారేపల్లి అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల నాయకులు, రైతుసంఘం జిల్లా నాయకులు వడ్డే వెంకటేశ్వర్లు మతృమూర్తి వడ్డే శాంతమ్మ దశదిన ఖర్మల సందర్భంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గుమ్మడి నర్సయ్య పాల్గొని మాట్లాడుతూ శాంతమ్మ ఆశయాలు సాధించాలని అన్నారు. ఈకార్యక్రమంలో గోగినపల్లి వెంకటేశ్వర్లు, చంద్రఅరుణ గుమ్మడి సందీప్, ఎన్‌వి.రాకేష్ పాల్గొన్నారు.

తల్లాడ తహసీల్దార్ బదిలీ

తల్లాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండల తహసీల్దార్ వి.రవికుమార్ బదిలీ అయ్యారు. తల్లాడ మండలం నుంచి ఖమ్మం అర్బన్‌కు రవికుమార్ బదిలీ అయ్యారు. డీటీ వనజకు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

దుస్తుల పంపిణీ

వైరా, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రాయపూడి అయ్యప్ప జన్మదినాన్ని పురస్కరించుకొని హమాలీలకు దుస్తులు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు సీహెచ్.వెంకటేశ్వరరావు, మరికంటి రాంగోపాల్, పెనుగొండ ఉపేందర్, కొల్లా రాంబాబు, మిట్టపల్లి సత్యంబాబు, చెరుకూరి శ్రీనివాసరావు, ఆర్.వెంకటేష్, కట్ల సురేష్, వై.రాజారావు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

వైరా, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైరాలో దుర్గామాత, బతుకమ్మ నిమజ్జన ఊరేగింపులో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని పాల్గొన్నారు. స్థానిక హనుమాన్ బజార్‌లో శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయ కమిటీ నిర్వహించిన ఈ వేడుకల్లో మల్లు నందిని పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ కోలాటమాడారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, వైరా మాజీ జడ్పీటీసీ బొర్రా ఉమాదేవి, రెండోవార్డు కౌన్సిలర్ బత్తుల గీత తదితరులు పాల్గొన్నారు.


వైరా: బతుకమ్మల ఊరేగింపులో పాల్గొన్న మల్లు నందిని


ముదిగొండలో దుర్గామాత శోభయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

బోనకల్: బోనకల్‌లో సొసైటీ, గ్రంథాలయ సెంటర్ల వద్ద ఏర్పాటు చేసిన దుర్గమ్మతల్లి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమా న్ని సోమవారం రాత్రి కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరిం చి పూజలు చేశారు.

బాలపేటలో ఘనంగా మహాపడిపూజ

తల్లాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం బాలపేట గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి మహాపడిపూజ వైభవంగా జరిగింది. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణంలో గురుస్వామి పులి కృష్ణయ్య 18వ పడి సందర్భంగా మహాపడిపూజ నిర్వహించారు. వైరా అయ్యప్ప దేవాలయం ప్రధాన అర్చకుడు రామకృష్ణశర్మ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పడిపూజ కార్యక్రమానికి తిరువూరు, పెనుబల్లి, కల్లూరు, వైరా, ఏన్కూరు, తల్లాడ మండలాలకు చెందిన వందలాది అయ్యప్ప మాలధారులు హాజరయ్యారు. కోదాడకు చెందిన భాస్కర్ బృందం భక్తిగీతాలను ఆలపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారం పంపిణీ చేశారు. గురుస్వాములు గోవిందు శ్రీనివాసరావు, పిన్ని కృష్ణయ్య, చిట్టెం నర్సింహారావు, పులి మహేంద్రబాబు, శరణ్మయి పాల్గొన్నారు.


పడిపూజలో పాల్గొన్న భక్తులు

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని శాంతినగర్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన పలువురు విద్యార్థు లను సోమవారం ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పపుమర్తి చందర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు లక్కినేని రఘులు ఎంబీబీఎస్ సీట్లు సాధించిన కొత్తపల్లి స్వరూప, తేల్లపుట్ల ఉదయ్‌కిరణ్, నల్లగట్ల మహిత, ఖమ్మంపాటి స్నేహలను శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్. నాగేశ్వరరావు, విశ్రాంతి కార్యదర్శి కె నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కొండూరి కిరణ్‌కుమార్, గుర్రాల సుధీర్, శాంతినగర్ డవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లివెంకటేశ్వర్లు, గుర్రాల సత్యానందం, వెంగల పెంటయ్య, కనకపూడి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గాలపై దాడులు సరికాదు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెనుబల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గంపై దాడి తీవ్రతరం అవుతుందని, ఆయా దేశాల ఆర్థిక సంక్షేమాల పర్యావసనాల్లో తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయని ఐఎఫ్ టీయూ జిల్లా నాయకుడు అమర్లపూడి శరత్ అన్నారు. ఈనెల 20న హైదరాబాద్‌లో జరుగనున్న సభా పోస్టర్లను సోమవారం పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆవిష్కరించారు. అనంతరం శరత్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిందన్న దేశాలు సైతం పాలకవర్గాలు ప్రజలు, కార్మికులపై అణచివేతను, దోపిడీని పెంచుతున్నాయన్నారు. కార్యక్రమంలో రమేష్, మారేశ్వరరావు, రవి, నందిని, బేబీ, కైరాణి, నాగమణి, నాగమ్మ పాల్గొన్నారు.

'సక్రమంగా రేషన్ బియ్యాన్ని అందించాలి'

వేంసూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భీమవరం గ్రామంలోని రేషన్‌షాపును సోమవారం తహసీల్దార్ ఎం.ఏ.రాజు తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని సక్రమంగా అందించాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

బోనకల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం మండల సీపీఐ నాయకులు పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. పీహెచ్సీని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని, పశువుల సంతను ఏర్పాటు చేయాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి ఆకేన పవన్ ఉన్నారు.

ఎట్టకేలకు ఆర్‌వోబీకి మరమ్మతులు

మధిరటౌన్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జికి సోమవారం ఎట్టకేలకు అదికారులు మరమ్మతులు ప్రారంభించారు. అనేక సంవత్సరాలుగా బ్రిడ్జి మరమ్మతులకు నోచుకోక పోవడంతో స్లాబుకు ఉన్న ఇనుప చువ్వలు బయటపడటంతో పాటు, గుంతలు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇద్దరు వ్యక్తులు కూడా ప్రమాదం భారీన పడి మరణించడంతో దీనిపై పలువురు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి కూడా తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రూ.70 లక్షల నిధులను మరమ్మతుల కోసం మంజూరు చేయించారు. దీనితో ఆర్‌అండ్‌బీ అధికారులు పనులను ప్రారంభించడంతో అనేక ఏళ్లుగా ఉన్న సమస్య ఎట్టకేలకు తీరనుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మరమ్మతులు చేస్తున్న దృశ్యం

తెలుగుయువత మాజీ అధ్యక్షుడికి నివాళి

వైరా, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రాయల నారాయణరావుకు తెలుగుదేశం పార్టీ నాయకులు నివాళులర్పించారు. సోమవారం నారాయణరావు దశదినకర్మ సందర్భంగా జరిగిన సంతాప సభలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైరా సొసైటీ మాజీ అధ్యక్షుడు మందడపు మధుసూధన్‌రావు, టీడీపీ మండల, పట్టణ కార్యదర్శులు కిలారు సురేందర్, మన్నేపల్లి ప్రదీప్, నాయకులు మోత్కూరి వెంకటేశ్వరరావు, మేదరమెట్ల పూర్ణచంద్రరావు, కోడె త్రాసు, చావా రాణి, కట్టా జనార్ధన్‌రావు, నర్సింహారావు, దావులూరి దినేష్, సంక్రాంతి శ్రీనివాసరావు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.